క్లుప్తంగా

మోదకొండమ్మ కొలువు ప్రారంభం



మోదకొండమ్మ కొలువు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారి కొలువు కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామంలో నెల రోజుల అమ్మవారి పండగ నిర్వహణలో భాగంగా ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను సతకం పట్టు వద్ద ఉంచి ప్రధాన పండగకు ఏర్పాట్లు చేస్తామని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేష్, ఉప సర్పంచ్ గెంజి రాజేష్‌కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు పదాల అప్పలనాయుడు, జగదీష్, కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పోటీలు



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం శివారు ఎరుకువాడ మెట్ట పక్కన్న ఎరుకుమాంబ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో భజన కార్యక్రమం, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయం సమీపంలో ఎడ్ల బళ్ల పందేలు నిర్వహించారు. ఇందులో విజేతగా లంకవానిపాలెం ఎడ్లబండి నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.12 వేలు, తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన అర్జునగిరి రూ.10 వేలు, లక్కవరం రూ. 8 వేలు, ఎల్.బి.పట్నం రూ. 6 వేలు, చుక్కపల్లి రూ. 4 వేలు, కూండ్రం రూ. 2 వేలు దక్కించుకున్నాయి.

కోశాధికారిగా త్రిమూర్తులు ఎన్నిక



కె.కోటపాడు: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కోశాధికారిగా కె.కోటపాడు రెవన్యూ కార్యాలయ ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో ఆయన్ను సభ్యులంతా ఎన్నుకున్నారు. గత కార్యవర్గంలోనూ కోశాధికారిగా పని చేసిన ఆయన మరోసారి ఎన్నిక కావడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్షయవ్యాధి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



గోడపత్రిను ఆవిష్కరిస్తురన్న డీఎం హెచ్‌వో హేమంత్, శారదాబాయి

అనకాపల్లిటౌన్: క్షయవ్యాధి నియంత్రణకు ప్రజలు సహకరించాలని జిల్లా డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం ఆయన క్షయవ్యాధిపై పలు సూచనలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు. క్షయ సోకిన రోగి దగ్గినప్పుడు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పొగ తాగడం ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుందని పేర్కొన్నారు. కొంత మంది అర్ధ పొగ సేవిస్తుంటారని, అటువంటి వారు ఈ వ్యాధికి త్వరగా దగ్గరవుతారని చెప్పారు. వ్యాధిని నిర్మూలించేందుకు పొగ తాగడం మనుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి, వైద్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

కశింకోట: స్థానిక గ్రంథాలయాన్ని గురువారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. గ్రంథాలయ అధికారి వరలక్ష్మిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామన్నారు.

సంక్షేమ లబ్ధితో అన్ని కుటుంబాల్లో వెలుగులు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరితపిస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులకు సూచించారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమై జగనన్నే మా భవిష్యత్తుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రతి ఇంటికి అతికించాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, పైల పోతురాజు, రుత్తల శ్రీనివాస్, మండల సచివాలయ కన్వీనర్లు శానాపతి వెంకటరత్నం, ఫాణి శాంతరామ్, చిటకెల వెంకటరమణ, అడిగర్ల నాయుడు పాల్గొన్నారు.



కె.కోటపాడు: మల్లంపాలెంలో సంక్షేమాన్ని వివరిస్తున్న శివాజీరాజు, సూర్యనారాయణ

కె.కోటపాడు: అర్హులైన కుటుంబాలకు సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ లబ్ధితో ఆయా కుటుంబాల్లో ఆనందపు వెలుగులు నింపుకుంటున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. గురువారం మల్లంపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు చేసిన మేలును వివరించారు. చంద్రబాబు మోసపూరిత పాలనలో ప్రజలను వంచించిన విధానాన్ని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సచివాలయాల గృహసారథుల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ తెలిపారు. ఆయా ఇళ్లకు ఇంటి యజమానుల అంగీకారంతో స్టిక్కర్లను అంటించారు. పార్టీ నాయకులు బొడ్డు దేముడుబాబు, వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, జాగరపు కన్నంనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం గ్రామాల్లో ఎంతో ఉత్సాహంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా రేయింబవళ్లు గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తామరంలో తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు గృహసారథులు, వలంటీర్లతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ముద్రించిన స్టిక్లర్లను ఇంటింటికీ అతికించారు. ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నారు.



మాడుగులలో వివరిస్తున్న ఎంపీటీసీ విజయలక్ష్మి తదితరులు

రోలుగుంట: ఎస్.కొత్తూరులో సర్పంచ్ పోతల రాజశేఖర్, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటా తిరిగి ఇంటి యజమానుల అనుమతితో కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యం కలిగించారు. సర్పంచ్‌లు కుసుర్లపూడిలో మడ్డు అప్పలనాయుడు, నిండుగొండలో సంధ్య, జానకీరాంపురంలో కృష్ణంనాయుడు ఈ కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల రూరల్: ఎం. కె.వల్లాపురంలో గురువారం సర్పంచ్ కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్ కరణం రాము ఇంటింటికీ వెళ్లి కర పత్రాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. ముకుందపురంలో సర్పంచ్ కర్రి గణేశ్, వంటర్లపాలెంలో సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



మాకవరపాలెం: తామరంలో సంక్షేమం వివరిస్తున్న హరిబాబు, తదితరులు

మాడుగుల: జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా మాడుగులలో ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి, వార్డు మెంబర్లు ఎడ్ల హేమంత్‌కుమార్, శీలాంమతులు జ్యోతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లు అతికించారు. ఒమ్మలిలో పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డపు భాస్కరరావు, గాదిరాయిలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పర్రే రామునాయుడు, సచివాలయ కన్వీనర్ రమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఎం.కోటపాడులో పార్టీ నాయకుడు శానాపతి గంగాధర్, కింతలి వల్లాపురంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, సురవరంలో ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, నాయకుడు శ్రీనాథు జగ్గారావు, చింతలూరులో నాయకుడు కాళింగ కళ్యాణరాజు, సత్యవరంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, నాయకులు ఇందుకూరి నాగరాజు, శనివాడ వెంకటరమణ, కాళ్ల రాజు, జగపరెడ్డి అప్పారావు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.



రోలుగుంట: ఎస్.కొత్తూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజశేఖర్, కార్యకర్తలు



మాడుగుల రూరల్: ఎం. కె.వల్లాపురంలో కరపత్రాలు అందజేస్తున్న ఉప సర్పంచ్ రాము

చీడికాడ: జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జేబీపురంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతిల ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగారు. బుధవారం రాత్రితో ఈ కార్యక్రమం శతశాతం పూర్తయినట్లు వారు తెలిపారు. మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, పార్టీ నాయకుడు లాలం జానకీరాం ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు.

వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- సర్వసభ్య సమావేశంలో రావికమతం ఎంపీపీ పైల రాజు

రావికమతం: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీపీ పైల రాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఎండలు మండుతున్నాయని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న దృష్ట్యా అధికారులు, సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బోర్ల విడి పరికరాలు కొనుగోలుకు రూ.8 లక్షలు కేటాయించామని, ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించాలన్నారు. మిషన్ వాత్సల్య పథకం పొందేందుకు జనన ధ్రువపత్రాలు త్వరితగతిన ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. చలిసింగంలో వాటర్ ట్యాంకు పనిచేయడం లేదని, కవగుంటలో కాలువల నిర్మాణం, మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు వంజరి గంగరాజు, దాసరి సూర్యకుమారి సభ దృష్టికి తెచ్చారు. మండల సమావేశానికి ఇరిగేషన్ అధికారులు రావడం లేదని సమస్య ఎవ్వరికీ చెప్పాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్స భవానీప్రసాద్, పీఆర్ డీఈ ప్రసాద్, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పైల రాజు

మంచినీటి కుళాయిలు ప్రారంభం



మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: రాజాం మరిడిమాంబ గుడి వద్ద మంచినీటి ఎద్దడి లేకుండా చేశారు. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు గోగుల సన్యాసి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు జనార్దనరావు రూ.1.50 లక్షలతో మంచినీటి బోరు, కుళాయిలు ఏర్పాటు చేసి భక్తులకు, పాదచారులకు దాహార్తి తీర్చారు. సర్పంచ్ మరిసా నాని, మాజీ ఎంపీటీసీ మరిసా పెదరమణ, నాయకులు కర్రి నాయుడుబాబు, మాజీ ఎంపీటీసీ సతీష్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

గడప గడపకు మన ప్రభుత్వంలో విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలోని ప్రతి సమస్యనూ పరిష్కరించడమే తమ ప్రభుత్వ ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తకోట మేజర్ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడం బాగుందని, కాలువలు ధ్వంసమైన దృష్ట్యా వాటిని బాగు చేయించాలని కోట మాణిక్యం, సోమిరెడ్డి ధనలక్ష్మి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తనకు వయస్సు 62 ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో 54గా నమోదైందని పింఛన్ వచ్చేలా చూడాలని కోట బాబూరావు కోరాడు. తన పింఛన్ ఆగిపోయిందని పడమటి రాజ్యలక్ష్మి మొరపెట్టుకోగా, స్థానిక సచివాలయ కార్యదర్శిని ధర్మశ్రీ ప్రశ్నించారు. ఆమె కుమారుడు చంటి ఐరన్, సిమెంట్ వ్యాపారం నిర్వహించేవారని, జీఎస్టీ సాంకేతిక కారణం వల్ల పింఛన్ ఆగిపోయిందని బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, భవానీ ప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, శీలం శంకర్రావు, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, కొత్తకోట ఎంపీటీసీలు కుంచా లక్ష్మి, పూడి దేవా, పైల చినమ్మలు, నాయకులు సోమిరెడ్డి రాజు, భీమరాతి శ్రీను, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొత్తకోటలో ప్రజల సమస్యలు వింటున్న ధర్మశ్రీ

రెండో విడతలో 856 సర్వే రాళ్లు



పొట్టినాగన్నదొరపాలెంలో సర్వే రాళ్లు వేస్తున్న తహసీల్దార్ కనకారావు, సర్పంచ్ కొండబాబు

నాతవరం: జగనన్న భూ రీసర్వేతో రైతుల సరిహద్దు సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. కె.వి.శరభవరం, పొట్టినాగన్నదొరపాలెం, ధర్మవరపు అగ్రహారం రెవెన్యూ గ్రామాల్లో గురువారం సర్వే రాళ్ల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొల్లంగిపాలెం రెవెన్యూ గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిందన్నారు. ఆ గ్రామాన్ని మొదట విడతలో రీసర్వే చేసి 234 సర్వే రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు రెండో విడత కింద రీసర్వే చేసిన మూడు రెవెన్యూ గ్రామాల్లో 856 సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైస్లు, ఉపాధి ఏపీవో చిన్నారావు, చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, వీఆర్వో బొత్సా శ్రీనివాస్, సచివాలయ సర్వేయర్లు విజయకుమార్, జగదీష్ పాల్గొన్నారు.

16న పైడితల్లమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: మండలంలో కేఎస్ఆర్‌పేట కొత్తూరులో వెలసిన పైడితల్లి అమ్మవారి నూతన ఆలయం మొదటి వార్షికోత్సవ వేడుకలు ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తారెత్తిస్తున్న ఎండలు..

రోలుగుంట/మాడుగుల రూరల్: రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు చుర్రుమంటున్నాడు. ఉపాధి వేతనదారులు, వ్యవసాయ కూలీలు ఉదయం 10.30 గంటల వరకే పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఎండ దెబ్బకు తాళలేక నీడకు చేరుతున్నారు. మూడు రోజుల నుంచి కాస్తున్న ఎండలకు ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గురువారం మధ్యాహ్నం కాసిన ఎండకు మాడుగుల ఘాట్‌రోడ్డు కూడలితోపాటు రోలుగుంటలోని బీఎన్‌రోడ్డు నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది.



రోలుగుంట: నిర్మానుష్యంగా బీఎన్ రోడ్డు

అంబేడ్కర్ జయంతి వేడుకలు నేడు

దేవరాపల్లి: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక అంబేడ్కర్ యూత్ సభ్యులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొంటారన్నారు.

ఉత్సాహంగా ఆటలు పోటీలు

నాతవరం: డాక్టరు బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆటలు పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. గ్రామ యువకులు, పెద్దలు ముప్పై ఏళ్లుగా అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నిర్వహించే వేడుకలకు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక క్రియేటివ్ హెడ్, సినీ నటుడు ఎల్.జోగినాయుడు హాజరు కానున్నారు. అదే రోజు ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.



బుచ్చెంపేటలో ఆటల పోటీలు

నేడు అయ్యప్పస్వామికి పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నట్లు గౌరీ పరమేశ్వర భజన బృందం, అయ్యప్ప మాలాధారణ భక్తులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాకవరపాలెం: స్థానిక శ్రీకన్య థియేటర్ వద్ద అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి ఇక్కడ నిర్వహించే ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనాలని నిర్వహకుడు సురేష్ కోరారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ మౌనిక

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజల చెంతకే వైద్య సేవలు అందనున్నట్లు హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి తెలిపారు. గురువారం మేడిచర్లలో వైద్యాధికారి జాహ్నవి 113 మందిని పరీక్షించారు. 67 రకాల వ్యాధులకు పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తామని ఆయన తెలిపారు. 14 రకాల ల్యాబ్ నిర్ధారణ పరీక్షలను చేయనున్నట్లు వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గాంధీ గ్రామం పంచాయతీ పరిధి సిటిజన్ కాలనీ సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ గాడి అప్పారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చోడవరం ప్రభుత్వాస్పత్రి డాక్టర్ మౌనిక గర్భిణులను పరీక్షించి పలు సూచనలు చేశారు. 145 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా రెండో గురువారం గాంధీగ్రామ పంచాయతీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపీహెచ్ఏ పి.సూర్యనారాయణ, ఏఎన్ఎం వై.శ్రీదేవి, ఆశకార్యకర్తలు, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

రాజబాబు ఏకగ్రీవ ఎన్నిక

కె.కోటపాడు: గొల్లలపాలెంకు చెందిన పల్లా రాజబాబు శ్రీకృష్ణ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు, ఏహెచ్‌వో శివకుమార్ సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘ సభ్యులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ రాయితీలను సొసైటీ ద్వారా అందించేందుకు కృషి చేస్తానని రాజబాబు తెలిపారు.

పందులను అరికట్టండి

అనకాపల్లి రూరల్: మండలంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో పందుల స్వైర విహారం ఎక్కువగా వుందని, అదే విధంగా కుక్కల బెడద కూడా మరింత ప్రమాదకరంగా వుందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయం అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. కొత్తూరు, సత్యనారాయణపురం పంచాయతీల పరిధిలో అనేక కాలనీలు, రహదారులు, జనావాసాల మధ్య విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్నాయని చెప్పారు. కుక్కలు కూడా భయాందోళనకు గురి చేస్తున్నాయని బీఎస్‌పీ నేత వనమాల నాగభూషణం, కొల్లి సత్యారావు, చిన్నారావు, అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని అగ్నిమాపక శాఖాధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు కార్యక్రమానికి ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు హాజరు కానున్నారన్నారు.

